నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, శుక్రవారం 22 నవంబర్ 2024 VIKARABAD

లగచర్ల గిరిజనులకు మద్దతు పెరుగుతున్నది. ప్రతిపక్ష పార్టీలతోపాటు గిరిజన, ప్రజా సంఘాల నాయకులు అండగా నిలిచారు. ఈ నెల 11న ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన అధికారులకు ఎదురుతిరిగిన వారి కోసం గ్రామంలో అర్ధరాత్రి సమయంలో పోలీసులు కరెంట్ సరఫరా నిలిపివేసి, ఇంటర్నెట్ సేవలను బంద్ చేసి ఇల్లిల్లూ జల్లెడ పట్టినా వారు దొరక్కపోవడంతో అమాయకులను భయభ్రాంతులకు గురి చేశారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు అని కూడా చూడకుండా దౌర్జన్యంగా వ్యవహరించగా ..బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీలు, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు పోలీసుల తీరును తీవ్రంగా ఖండించి..లగచర్ల బాధితులకు మేమున్నామన్న భరోసా కల్పిస్తున్నారు.

-వికారాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ) :

## లగచర్ల బాధితులకు పెరుగుతున్న మద్దతు

# మేమున్నామని..

- రైతులకు అండగా బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీలు, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ల వద్దకు తీసుకెళ్లి గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని ప్రపంచానికి తెలిసేలా చేసిన బీఆర్ఎస్
- ఇంకా ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగానే సర్కారు చర్యలు
- ఎస్టీ కమిషన్ ఆదేశాలు బేఖాతరు..
- ఇంకా.. పోలీసుల పహారాలోనే లగచర్ల పరిసర గ్రామాలు




లగచర్ల బాధితులకు అన్ని వర్గాల నుంచి మద్దతు పెరుగుతున్నది. పోలీసుల తీరును ఎండగడుతూ మేమున్నామనే భరోసాను ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఇస్తున్నారు. లగచర్ల ఫార్మాభూ బాధిత రైతులకు బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నది. ప్రభుత్వం రైతుల పట్టా భూములను తీసుకుంటామని ప్రకటించిన నాటి నుంచే వారికి అండగా ఉన్నది. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి రైతుల భూములను తీసుకోవద్దని పాదయాత్ర తలపెట్టారు. అదేవిధంగా ఫార్మా కంపెనీలకు భూములు ఇచ్చేది లేదని ఎదురు తిరిగిన గిరిజన రైతులను ప్రభుత్వం జైల్‌లో పెట్టి నిర్బంధించగా.. ఆ రైతుల కుటుంబీకులను ఢిల్లీలోని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ల చైర్మన్ల దృష్టికి బీఆర్ఎస్ పార్టీ తీసుకెళ్లి..గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రపంచానికి తెలిసేలా చేయడంతోపాటు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న నియంతృత్వ వైఖరిని ఎండగట్టుతున్నది. స్పందించిన ఎస్టీ కమిషన్ సభ్యులు నేరుగా లగచర్లకు వచ్చి రేవంత్ ప్రభుత్వ చర్యలను ఎండగట్టడంతోపాటు గిరిజనులకు భరోసా ఇచ్చారు. అదేవిధంగా బీజేపీ, వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు లగచర్ల గిరిజనులకు అండగా నిలిచి.. అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేసి ప్రజాభిప్రాయానికి అనుగుణంగా భూసేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

### పది రోజులు దాటినా..

సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్ పరిధి, దుద్యాల మండలంలోని లగచర్ల, పోలేపల్లి, హకీంపేట, రోటిబండతండా, పులిచర్ల తండాల పరిధిలోని సుమారు 1300 ఎకరాల్లో ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నాటి నుంచే ఆయా గ్రామాలు, తండాల గిరిజనులు వ్యతిరేకిస్తున్నారు. ఫార్మా విలేజ్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత భూసేకరణకు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పదుల సార్లు గిరిజనులతో సమావేశమై కంపెనీలొస్తే ఉద్యోగాలొస్తాయని నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం గమనార్హం. ఫార్మా విలేజ్ ఏర్పాటుకు తమ భూములను ఇస్తామని ఒకరిద్దరు కాంగ్రెస్ నాయకులు ముందుకొచ్చి ఫార్మా కంపెనీల ఏర్పాటుకు అనుకూలంగా ప్రకటనలు చేసినా బాధిత గ్రామాల ప్రజలంతా మొదట్నుంచి వద్దంటే వద్దే.. వద్దు అంటూ వ్యతిరేకిస్తున్నారు.

అయినా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసం ఈ నెల 11న లగచర్లలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లగా వారిపై గిరిజనులు ఎదురుతిరిగారు. ఈ ఘటన అనంతరం అమాయక గిరిజన మహిళలపై పోలీసుల దౌర్జన్యంతోపాటు సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి బాధిత తండాల్లో పర్యటించి ఎట్టిపరిస్థితుల్లోనూ భూములివ్వాల్సిందేనని బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మరోవైపు లగచర్ల ఘటన జరిగి పది రోజులు దాటినా ఇంకా పోలీసుల పహారాలోనే తండాలు ఉన్నాయి. లగచర్లతోపాటు తండాల చుట్టూ పోలీసులు పదుల సంఖ్యలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఎవరిని కూడా అటు వైపు వెళ్లనివ్వడం లేదు. తండాల్లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని ఎస్టీ కమిషన్ హెచ్చరించినా ప్రభుత్వం మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నది.


# మా భూములే దొరికాయా?

## ఫోర్త్ సిటీకి వెళ్లేందుకు ఎన్నో దారులున్నాయ్

- బలవంతపు భూ సర్వే నిలిపివేయాలి
- ఆర్డీవోకు రైతుల వినతి

కందుకూరు : బలవంతంగా తమ భూముల్లో సర్వే చేయవద్దని, తక్షణమే ఆ పనులను నిలిపివేయాలని అధికారులను రైతులు వేడుకున్నారు. 'ఫోర్త్‌సిటీకి రోడ్డును ఏర్పాటు చేయడానికి మా భూములే దొరికాయా' అంటూ అధికారులను ప్రశ్నించారు. రోడ్డు ఏర్పాటు చేయడానికి మండల పరిధిలోని రాచులూరు, గాజులబుర్జు తండా, అగర్‌మియగూడలో 3 సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. అగర్‌మియగూడ గ్రామానికి సర్వే నిర్వహించేందుకు ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ గోపాల్, ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, కందుకూరు, మహేశ్వరం ఠాణాల సీఐలు సీతారాం, వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది గురువారం రావడంతో రైతులు మండిపడ్డారు. తమను చర్చలకు రావాలని పిలిచి సర్వే చేస్తారా అంటూ ప్రశ్నించిన అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. తమకు భూమికి, భూమి ఇవ్వాలని పట్టుబట్టారు.

ఫోర్త్‌సిటీకి వెళ్లేందుకు ఎన్నో మార్గాలు ఉన్నాయని, శ్రీశైలం, జాతీయ రహదారి కొత్తూరు వద్ద మాజీ సీఎం కేసీఆర్ జంక్షన్ ఏర్పాటు చేశారని, నాగార్జునసాగర్ జాతీయ రహదారి, తిమ్మాపూరు నుంచి వెళ్లడానికి అనువుగా ఉందని సూచించారు. అక్కడి నుంచి రోడ్డు నిర్మిస్తే భూములు పోవని.. తమ భూములు లాక్కోవద్దని వేడుకున్నారు. అయినా అధికారులు సర్వే నిర్వహించారు. దీంతో రైతులు తమకు ఎకరాకు ఎంత పరిహారం అందజేస్తారని చెప్పకుండా ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. రైతుబంధు, రైతు బీమా వర్తించే విధంగా చూడాలని కోరారు.



అగర్‌మియగూడలో ఆర్‌డీవో అనంతరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ప్రభుత్వం చెబుతున్న మాటలు నమ్మశక్యంగా లేవన్నారు. పచ్చని పొలాలను ఎలా గుంజుకుంటారని నిలదీశారు. ఆర్డీవో అనంతరెడ్డి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని సర్వేకు అడ్డుచెప్పడం సమంజసం కాదని రైతులకు సూచించారు.



## టాక్సీ, మోటర్ క్యాబ్ సబ్సిడీలు నిలిపివేత

- వచ్చే నెల 1 నుంచి..
- పరిశ్రమల శాఖ వికారాబాద్ జిల్లా మేనేజర్

వికారాబాద్, నవంబర్ 20 : టాక్సీ, మోటర్ క్యాబ్ సబ్సిడీలను నిలిపివేస్తున్నట్లు పరిశ్రమల శాఖ వికారాబాద్ జిల్లా మేనేజర్ మహేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా ప్రభుత్వం నిర్వహిస్తున్న టీ-ప్రైడ్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ లబ్ధిదారులకు టాక్సీ, మోటర్ క్యాబ్ కోసం అందిస్తున్న సబ్సిడీలను వచ్చే నెల 1 నుంచి కొనుగోలు చేసే వాహనాలకు నిలిపేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు చేసిందన్నారు.



బీఆర్ఎస్ హయాంలో ఎలాంటి చింత లేకుండా ప్రభుత్వం అందించిన రైతుబంధు పెట్టుబడి సాయంతో పంటలను సకాలంలో సాగు చేసుకున్న అన్నదాత.. రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. వానకాలం రైతు భరోసాను ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. యాసంగి సీజన్ ప్రారంభమైనా ఇంకా దాని విడుదలపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పుడు కూడా వడ్డీ వ్యాపారులు, దళారులను ఆశ్రయించి.. అప్పులు చేయాల్సిందేనా..? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

-రంగారెడ్డి, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ)

# రైతుకు భరోసా ఏదీ

## ప్రారంభమైనా యాసంగి సీజన్..

- రైతుభరోసా విడుదలపై ఊసేలేదు
- వానకాలంలోనూ ఎగ్గొట్టిన రేవంత్ సర్కారు
- ఇప్పుడూ వడ్డీ వ్యాపారులు, దళారుల వద్ద అప్పులు చేయాల్సిందేనా : అన్నదాతలు
- రంగారెడ్డి జిల్లాలో అర్హులైన రైతులు 3,25,217మంది
- బీఆర్ఎస్ హయాంలో సకాలంలో రైతుబంధు పంపిణీ

రేవంత్ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతన్నకు భరోసా లేకుండా పోయింది. కేసీఆర్ హయాంలో పంటల సాగుకు ప్రతిఏటా ఎకరానికి రూ.పది వేల చొప్పున పంపిణీ చేసేవారు. దానితో జిల్లాలోని రైతులు ఎవరికీ చేయి చాపకుండా అవసరమైన ఎరువులు, విత్తనాలను సమకూర్చుకుని సకాలంలో పంటలను సాగు చేసేవారు. కానీ, ప్రభుత్వం మారడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వానకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టడంతో.. అన్నదాతలు వడ్డీ వ్యాపారులు, దళారుల నుంచి అప్పులు తీసుకొచ్చి.. పంటలను సాగు చేశారు. ప్రస్తుతం యాసంగి సీజన్ మొదలైంది. అన్నదాతలు ఇప్పుడైనా రైతుభరోసా అందుతుందా..? అన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం దాని విడుదలకు సంబంధించి ఎలాంటి ప్రకటన విడుదల చేయకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు కూడా అప్పులు చేసేలా తప్పేలా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రాగానే రైతుబంధు పథకాన్ని.. రైతు భరోసాగా మార్చి ఎకరానికి రూ.15,000 ఇస్తామని.. ఊదరగొట్టిన కాంగ్రెస్ నాయకులు పవర్‌లోకి రాగానే.. ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేస్తామని, పథకం విధివిధానాలను రూపొందిస్తామని చెబుతూ అన్నదాతలను మోసం చేస్తున్నారు.

### రైతుభరోసా పంపిణీ చేయకుంటే.. ఆందోళనలు చేస్తాం



కేసీఆర్ హయాంలో అన్నదాతలకు సకాలంలో రైతుబంధు సాయం అందేది. దానితో ఎరువులు, విత్తనాలను కొని పంటలను సాగు చేసుకునేవారు. కానీ, ప్రభుత్వం మారి దారిద్రపు హస్తం పార్టీ అధికారంలోకి రావడంతో అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. వానకాలంలోనూ రైతు భరోసాను ఎగ్గొట్టారు. ఇప్పుడూ వస్తుందా ..? అంటే ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనలేదు. అన్నదాతలు అప్పుల పాలు కాకుండా.. సర్కారు వెంటనే రైతుభరోసా నిధులను విడుదల చేసి ఆదుకోవాలి. లేకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తాం.

-మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

### రైతులపై వివక్ష తగదు..



గత బీఆర్ఎస్ హయాంలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పంటలను సాగు చేసుకున్నాం. రూ. 15 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వానకాలం రైతుభరోసాను ఎగ్గొట్టడం సిగ్గుచేటు. ప్రస్తుతం యాసంగి సీజన్ మొదలైంది. ఈ సీజన్‌లోనైనా సకాలంలో పెట్టుబడి సాయాన్ని అందించి అన్నదాతలను ఆదుకోవాలి. రైతులపై ప్రభుత్వానికి వివక్ష తగదు.

-గడ్డం రాజేశ్, మంచాల

### జిల్లాలో అర్హులైన రైతులు 3,25,217మంది..

వానకాలంలో అన్నదాతలు సాగు చేసిన వరి, పత్తి పంటలకు సరైన మద్దతు ధర రాకపోవడంతో వారు ఆ పంటలను ఇండ్లలోనే నిల్వ చేశారు. దీంతో అవి అమ్ముడు పోకపోవడంతో రైతుల చేతుల్లో చిల్లిగవ్వ లేకుండా పోయింది. ప్రస్తుతం స్పందించి సకాలంలో రైతు భరోసాను విడుదల చేస్తే పంటల సాగుకు ఉపయుక్తంగా ఉంటుం దని వారు కోరుతున్నారు. కాగా జిల్లాలో అర్హులైన రైతులు 3,25, 217 మంది ఉన్నారు. బీఆర్ఎస్ హయాంలో 3,25,217 మంది రైతులకు ప్రభుత్వం ప్రతి ఏటా ఎకరానికి రూ.పది వేల చొప్పున పంపిణీ చేసింది.

### విధివిధానాల పేరుతో కాలయాపన..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు స్థానంలో రైతుభరోసా పథకాన్ని తీసుకొచ్చింది. ఇందుకోసం ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. కానీ, ఆ సబ్ కమిటీ మీటింగ్‌లు కాక.. విధి విధానాలను రూపొందించలేదు. దీంతో సబ్‌కమిటీ ఎప్పుడు సమావేశమవుతుందో.. ఎప్పుడు విధి విధానాలను రూపొందిస్తారో తెలియక అధికారులు కూడా రైతులకు ఏం చెప్పలేని పరిస్థితి నెలకొన్నది.

# గజగజ

## రంగారెడ్డి జిల్లాను వణికిస్తున్న చలి

- గణనీయంగా పడిపోతున్న పగటి ఉష్ణోగ్రతలు
- బయటికి వెళ్లేందుకు జంకుతున్న ప్రజలు
- చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలి : వైద్యనిపుణులు



నార్సింగి ఓఆర్ఆర్‌పై పొగమంచు




**రంగారెడ్డి జిల్లాలో చలి తీవ్రత రోజు రోజుకూ పెరుగుతున్నది. వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ఉదయం నుంచి రాత్రి వరకు చల్లటి గాలులు వీస్తున్నాయి. గత నాలుగు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. ఉదయం 8 గంటల వరకు మంచు కమ్ముకుంటున్నది. చలి తీవ్రం కావడంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారు. అలర్జీ, ఆస్తమా, శ్వాసకోశ, బీపీ, గుండె సంబంధిత వ్యాధులు కలిగిన వారు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.**

-షాబాద్, నవంబర్ 21

చలికాలం ప్రారంభంలోనే జనం వణికిపోతున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో ఉదయం ఎనిమిది గంటల వరకు మంచు కమ్ముకుంటున్నది. దీంతో ఉదయమే బయటికి వెళ్లే పాల వ్యాపారులు, కూరగాయల రైతులు, కార్మికులు, కూలీ లు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 5 నుంచి 6గంటల తర్వాత చలి గాలులు వీస్తుండటంతో జనం ఇండ్లకే పరిమితమవుతున్నారు. వేడి మంటలు వేసుకుంటున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

### జాగ్రత్తలు తప్పని సరి..

జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జోరుగా వీస్తున్న గాలులు ప్రజలను వణికిస్తున్నాయి. దీనికి తోడు గాలిలో తేమశాతం కూడా పెరుగడంతో ఉదయం వేళల్లో చాలా గ్రామాల్లో పొగమంచు కమ్ముకుంటున్నది. తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 8గంటల వరకు గ్రామాలతోపాటు రహదారులను మంచు తెరలు కమ్మేస్తున్నాయి. చలి గాలుల తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. చలి గాలులు ఎక్కువగా ఉండే సమయాల్లో ప్రయాణాలు చేసేటప్పుడు స్వెట్టర్లు, చేతులకు గ్లౌజులు ధరిస్తే మంచిదంటున్నారు.



షాబాద్‌లో కమ్ముకున్న పొగమంచు

# హైడ్రాకు 100కుపైగా ఫిర్యాదులు

సిటీబ్యూరో: మళ్లీ హైడ్రా కూల్చివేతలు స్పీడందుకున్నట్లేనా..! అంటే అవుననే చెబుతున్నారు అధికారులు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలంటూ తమ కార్యాలయానికి వస్తున్న ఫిర్యాదులపై దృష్టి పెట్టిన హైడ్రా.. ఆయా ప్రాంతాల్లో సంబంధిత శాఖల రిపోర్టుల ఆధారంగా కూల్చివేతలను కొనసాగించనున్నది. ఓఆర్ఆర్ లోపల చాలా ప్రాం తాల్లో రోడ్లు, పార్కులు కబ్జా చేశారంటూ.. కాలనీల నుంచి వచ్చిన ఫిర్యాదులపై హైడ్రాబృందాలు వేర్వేరుగా స్థానిక అధికారులతో కలిసి కొన్నిచోట్ల క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు తెలుసుకున్నాయి. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లాతోపాటు ఓఆర్ఆర్ లోపల పలుచోట్ల కూల్చివేతలు చేసిన హైడ్రా..రానున్న రెండు మూడురోజుల్లో మరిన్ని ప్రాంతాల్లో కూల్చివేతలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే హైడ్రా బృందం రెవెన్యూ, ఇరిగేషన్, లీగల్ టీంలతో కలిసి తమ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నది. ఇందులో ఎక్కడ సులువుగా పని జరుగుతుందో, న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా ఎక్కడ ఉంటాయో చూసుకొని.. అక్కడ తమ బృందాలతో చర్యలకు సిద్ధమవుతున్నది. ఈ నెల రోజుల్లో హైడ్రా కార్యాలయానికి వందకు పైగా ఫిర్యాదులు వచ్చినట్లు తెలిసింది. ప్రధానంగా పలు కాలనీల్లో నాలా లు, పార్కులు, రోడ్ల ఆక్రమణలపై కాలనీలు, స్థానికుల నుంచి ఈ ఫిర్యాదులొచ్చాయి. అయితే అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పటేల్‌గూడలో హైడ్రా కూల్చివేతలపై భూయజమానులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కోర్టు సర్వేకు ఆదేశించి తదుపరి చర్యల వరకు స్టేటస్ కో విధించింది. కోర్టు వివాదాల నేపథ్యంలో తమ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ లీగల్ టీంతో సమీక్షించారు.

### ఔటర్ లోపల..

ఓఆర్ఆర్ లోపల జీహెచ్ఎంసీతోపాటు 27 మున్సిపాలిటీలు, 33 గ్రామపంచాయతీలు హైడ్రా పరిధిలోకి వస్తాయి. వీటిలో హైడ్రాకు వచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువగా సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోనే ఉన్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న పార్కులు, రోడ్ల స్థలాల ఆక్రమణలపై వచ్చిన వాటిపై హైడ్రా బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించింది. ఆక్రమణలు చేసిన వారికి నోటీసులూ ఇచ్చామని వారి నుంచి వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో రెండోసారి కూడా జారీ చేసినట్లు అధికారులు చెప్పారు. వారికిచ్చిన వివరణను బట్టి చర్యలకు దిగడానికి హైడ్రా సిద్ధమవుతున్నది.